బోనస్ వర్తించేలా చూడాలి

ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి



కొండపాక(గజ్వేల్): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు

కొండపాక(గజ్వేల్): ప్రతీ పంటకు రూ.500 బోనస్ వర్తించేలా చూడాలని ఎమ్మెల్సీ వంటేరు యావదరెడ్డి డిమాండ్ చేశారు. కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్, మాత్‌పల్లి, తిప్పారం, బొబ్బాయిపల్లి గ్రామాల్లో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యానికి మద్దతు ధర దక్కేలా చూసేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటూ మద్దతు ధరను పొందాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, కామన్ ధర రూ.2,300లకు చెల్లిస్తారని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవడానికి ఏఈఓల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని, రైతులు కల్లాల వద్ద ధాన్యాన్ని ఆరుబెట్టుకొని తాలు లేకుండా చూసుకొని కేంద్రానికి తీసుకురావాలని చెప్పారు. కోవాలన్నారు. సన్నరకం ధాన్యానికి మాత్రమే క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను చెల్లిస్తామంటూ ప్రభుత్వం చెప్పడం దారుణమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం మగ్దుమ్ అలీ, ఏఓ గోవిందరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రమేశ్‌రెడ్డి, ఉపేందర్, గ్రామ సంఘం మహిళలు, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే గిట్టుబాటు ధర

మద్దూరు(హుస్నాబాద్)/నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి సూచించారు. మండలంలోని జాలపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్ రెడ్డి, కమలాకర్ యాదవ్, మల్లేశం, సాయిలు, మనోహర్, శ్రీధర్ రెడ్డి, వరలక్ష్మి, సాగర్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, సీసీ నర్సయ్య, పద్మ, వీఓఏ అనిత తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నంగునూరు మండలం ఖానాపూర్, మైసంపల్లి, నర్మేట, తిమ్మాయిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పాలమాకుల పీఏసీఎస్ చైర్మన్ ఎల్లంకి మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని అమ్మాలని, దళారులను నమ్మి మోస పోవద్దని చెప్పారు. తహసీల్దార్ సరిత, సెక్రెటరీ శ్రీకాంత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు(హుస్నాబాద్): కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జీవన్‌రెడ్డి తదితరులు



నంగునూరు(సిద్దిపేట): నర్మేటలో ప్రారంభిస్తున్న మహిపాల్‌రెడ్డి

ఐక్యత, క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత



ఎన్‌సీసీ కేడెట్లతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: ఎన్‌సీసీ అంటే ఐక్యత, క్రమశిక్షణకు మారుపేరని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు. ఆలిండియా ఎన్‌సీసీ ట్రెక్కింగ్ ఎక్స్‌పెడిషన్‌లో ప్రతిభ చూపిన కళాశాలకు చెందిన కేడెట్లను శనివారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేడెట్లు తుల్జారామ్, వేణు, తిరుపతి ఇటీవల ఏపీలోని అరుకు వ్యాలీలో 8రోజుల పాటు నిర్వహించిన ట్రెక్కింగ్ ఎక్స్‌పెడిషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్‌టేకర్ కృష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి డా.గోపాల సుదర్శనం, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డా.సీహెచ్ మధుసూదన్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి విద్యార్థుల ఎంపిక

అదే విధంగా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు సమద్, శివగణేశ్, స్వామిచరణ్ ఎస్‌జీఎఫ్ అండర్ –19 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో సంగారెడ్డిలో జరగనున్న పోటీల్లో వారు పాల్గొంటారని ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా వారిని ఎస్‌ఈజీఎఫ్ జిల్లా సెక్రెటరీ మంతెన సమ్మయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా స్పోర్ట్స్ ఇన్‌చార్జి వెంకటేశ్, కళాశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జి అశోక్, అధ్యాపకులు కనకచంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, నగేశ్, వెంకటరమణ, రఘురాజ్, గంగాధర్ తదితరులు అభినందించారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 29న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అండర్–14, 17కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 9గంటలకు హాజరవ్వాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

దౌల్తాబాద్ (దుబ్బాక): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో పీజీటీ పోస్టుల భర్తీ కోసం గంటల ప్రాతిపదికన పనిచేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ కోరారు. ఎంఎస్సీ ఫిజిక్స్, బీఎడ్ విద్యార్హత కలిగిన వారు 29లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టీ కోసం వెళ్లి అదృశ్యం



భూమయ్య

దుబ్బాకటౌన్: టీ తాగి వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన ఓ కూలీ అదృశ్యమయ్యాడని ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన బెల్లె భూమయ్య గత17న టీ తాగిస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో అతడి భార్య బెల్లె నర్సవ్వ శనివారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధ్యాయురాలి వితరణ



వర్గల్(గజ్వేల్): భర్త స్మారకార్థం తాను పనిచేస్తున్న పాఠశాలకు ఓ ఉపాధ్యాయురాలు సౌండ్ సిస్టమ్, విద్యార్థులకు డిక్షనరీలు అందజేశారు. మండలంలోని వేలూరు జెడ్పీఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయురాలు సంగీత భర్త ఎడ్ల లింగమూర్తి సంవత్సరం క్రితం మృతిచెందారు. ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం పాఠశాలకు రూ.16వేలు విలువైన సౌండ్ సిస్టమ్, పదోతరగతి విద్యార్థులకు రూ.5వేలు విలువైన డిక్షనరీలను అందజేశారు. హెచ్‌ఎం కృష్ణసౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నైపుణ్యతను చాటినప్పుడే అవకాశాలు

ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన

గజ్వేల్‌రూరల్: నైపుణ్యతను చాటినపుడే అవకాశాలు మెండుగా లభిస్తాయని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన సూచించారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ఆ కళాశాలలో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు మహేంద్ర ప్రైడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'క్లాస్ రూమ్ వన్ వీక్' శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు తమలోని నైపుణ్యాన్ని చాటినపుడే మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలు ఇంటర్వ్యూ సమయంలో దోహదపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, ట్రెనర్ ఓంజీ, టీఎస్‌కేసీ మెంటర్ సందీప్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజయం మీదే..

ప్రణాళికా బద్ధంగా చదివితే తప్పక విజయం సాధించగలరని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన బోధనను అందించేందుకు తమవంతు కృషి చేస్తామని, తల్లిదండ్రులు సైతం తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉత్తమ ఫలితాల సాధనలో అధ్యాపకులతో పాటు తల్లిదండ్రుల కృషి అవసరమని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటరమణ, రాజిరెడ్డి, ప్రకాశ్, హాస్టల్ వార్డెన్లు దేవీదాస్, కనకయ్య పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను పెంచడం తగదు

మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్

హుస్నాబాద్: అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడం దారుణమని, ప్రజలు వ్యతిరేకించాలని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 200 యూనిట్లు దాటితే ప్రస్తుతం ఉన్న రూ.10 ఫిక్స్‌డ్ చార్జీలను రూ.50కు పెంచాలని డిస్కమ్‌లు ప్రతిపాదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజలపై రూ.18వేల కోట్ల భారాన్ని మోపాలని చేస్తున్న ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన కల్నల్



కల్నల్ దానియేల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ఎన్‌సీసీ కరీంనగర్ 9వ బెటాలియన్ కల్నల్ డానియేల్ లొట్జిం, సబ్ మేనేజర్ సాగర్‌సింగ్, హవల్దార్ మల్లప్ప పూజారి, పీవీరావు బృందం శనివారం సందర్శించింది. కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు వారికి స్వాగతం పలికారు. వారి పనితీరు, రోజువారీ కార్యక్రమాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దానియేల్ మాట్లాడుతూ బి సర్టిఫికెట్‌లో 100 శాతం సీ సర్టిఫికెట్‌లో 100శాతం కేడెట్లు ఉత్తీర్ణత సాధించారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ డాక్టర్ స్వప్నను ఆయన అభినందించారు. ఎన్‌సీసీలో చేరి డిగ్రీలో మంచి ఫలితాలు సాధించిన వారికి స్కాలర్‌షిప్ మంజూరవుతుందని చెప్పారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు కల్నల్‌ను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు తొలగించారు..

సాక్షి ఎఫెక్ట్



బ్లీచింగ్ పౌడర్‌ను చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికుడు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గోవర్ధనగిరి పరిధిలోని ఇప్పలపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక ఆవరణలో నిలిచిపోయిన మురుగు నీటిని పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. 'మురుగు ఇలా..ఆడేదెలా?' ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో దుర్గంధం అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి మండల అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సుభాష్ మాట్లాడుతూ గ్రామంలో పేరుకుపోయిన డ్రైనేజీలను, పాఠశాల ఆవరణలో మురుగునీటిను శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించామన్నారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉపకారవేతనాలు విడుదల చేయండి

ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి భరత్



వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): పెండింగ్‌లో ఉన్న ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ చేర్యాల డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్ డిమాండ్ చేశారు. శనివారం వారు ధర్నా నిర్వహించి తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు రూ.8వేల కోట్ల ఉపకార వేతనాలు, రీయింబర్స్‌మెంట్ ఆరేళ్లుగా విడుదల చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యంవల్ల పేద విద్యార్థులను ప్రైవేటు యాజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విక్రమ్, సమీర్, రాఘవ, చందు, కైలాస్, సన్ని తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కమిషనర్ల అధ్యయనం



పరిశీలనలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్లు

సిద్దిపేటజోన్: రాష్ట్ర మున్సిపల్‌శాఖ ఆదేశాల మేరకు శనివారం సిద్దిపేట మున్సిపాలిటీని వివిధ మున్సిపల్ కమిషనర్లు సందర్శించారు. వారికి మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ వివిధ అంశాలను వివరించారు. వారంతా స్థానిక 25వ వార్డులో ఇంటింట చెత్త సేకరణ ప్రక్రియ పరిశీలించారు. అనంతరం డంపుయార్డ్‌ను, తడి చెత్తతో బయోగ్యాస్ తయారీ ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. అదేవిధంగా అక్కడి మానవ వ్యర్థాల శుద్ధీకరణ యూనిట్‌ను పరిశీలించారు. అనంతరం పట్టణంలో పాడిచెత్త సేకరణ కేంద్రం స్వచ్ఛ బడిని సందర్శించారు. తడి, పొడి చెత్త పునర్వినియోగం గురించి ఆరా తీశారు. సిద్దిపేటను సందర్శించిన వారిలో బెల్లంపల్లి, జగిత్యాల, పెద్దపల్లి, సుల్తానాబాద్, రాయికల్, వేములవాడ, ధర్మపురి మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్‌రావు, చిరంజీవి, వెంకటేశ్, జగదీశ్వర్, సంపత్, గంగాధర్, నిజామాబాద్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్లు రాజేందర్, రాజు, మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపల్ ప్రతినిధులు నాగేశ్వర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం: సీఐ



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

మిరుదొడ్డి(దుబ్బాక)/గజ్వేల్‌రూరల్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, ఈవ్ టీజింగ్ లాంటి అంశాలపై శనివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన మేరకు మాత్రమే సోషల్ మీడియాను వినియోగించాలన్నారు. చదువుకునే సమయంలో చెడు ఆలోచనలకు తావు ఇవ్వొద్దని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేస్తే ఎలాంటి వివరాలు తెలపొద్దని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కరుణ, కిషన్, ఏఎస్‌ఐ మహిళా కానిస్టేబుళ్లు మమత, వీణాకుమారి, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్‌లోని శ్రద్ధ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మురళి పాల్గొన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే 100కు లేదా స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498, పోలీస్‌స్టేషన్ 8712667435కు తెలియజేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ శ్రవణ్‌కుమార్, షీటీమ్ సిబ్బంది శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సస్యరక్షణతో నత్తల నివారణ



కూరగాయ పంటలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చిన్నకోడూరు(సిద్దిపేట): కూరగాయల సాగులో నత్తల నివారణకు రైతులు సామూహికంగా సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు డా.అనిత కుమారి, డా.ప్రీతం, డా.సురేశ్ సూచించారు. మండల పరిధిలోని పెద్దకోడూరులో వారు శనివారం కూరగాయ పంటల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తేమ ఎక్కువగా ఉండే, చీకటి ప్రాంతాల్లో నత్తలు రాత్రిపూట పంటను ఆశించి నష్టపరుస్తాయన్నారు. నత్తలు రాత్రిపూటే తిరుగుతాయని, ఉప్పు గాని, సున్నం గాని పంట చుట్టూ చల్లుకోవాలని సూచించారు. క్యాబేజీ కాని బొప్పాయి ఆకుకాని పొలంలో వేసినట్లయితే నత్తలు ఎక్కువగా ఆకర్షిస్తాయని, తర్వాత ఆ ఆకులను ఏరి కాల్చి వేయాలని చెప్పారు. యాజమాన్య పద్ధతులు, నివారణ చర్యల గురించి వివరించారు.

ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా జాతీయ రహదారి పనులను తొందరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ రజిత ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆమె అధ్యక్షతన హైవే అధికారులు, కాంట్రాక్టర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ రహదారికి సంబంధించి పట్టణంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, లైటింగ్ పనులు నెమ్మదిగా సాగుతున్నాయన్నారు. 15రోజుల నుంచి వీధి లైట్లులేక పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే పనులు పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మాజీ ఎంపీపీ వెంకట్, మల్లికార్జున్, ఇంజనీర్లు పాల్గొన్నారు. అలాగే పొట్టేలు సినిమాలో నటించిన స్థానిక కళాకారులు ముక్కెర సంపత్ కుమార్, తాడూరి సురేశ్, బోనగిరి రజితను చైర్ పర్సన్ సన్మానించారు.

పేకాట స్థావరంపై దాడి

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని తోర్నాల శివారులో కొంతమంది పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఓ పేకాట స్థావరంపై దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకోగా ఇద్దరు పారిపోయారు. వారి వద్ద నుంచి రూ.3,700, నాలుగు ఫోన్లు, అయిదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఎస్‌ఐ అపూర్వరెడ్డి తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే వెంటనే 8712667445, 8712667446లకు ఫోన్‌చేసి సమాచారం తెలియజేయాలని కోరారు.

'అపార్'పై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

చిన్నకోడూరు(సిద్దిపేట)/నంగునూరు(సిద్దిపేట): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థుల సమాచార నిధి 'అపార్'పై విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్)లో భద్రపరుస్తున్నారన్నారు. అందులో భాగంగా జాతీయస్థాయిలో ప్రతి విద్యార్థికి జీవిత కాలం ఉపయోగపడే 12అంకెల గుర్తింపు సంఖ్య కేటాయిస్తున్నారని చెప్పారు. దీని ఆధారంగా విద్యార్థుల సమగ్ర వివరాలను 'అపార్'లో నమోదు చేస్తారని, అదే విధంగా ఈ నంబర్‌తో పాటు క్యూఆర్‌తో కూడిన గుర్తింపు కార్డును జారీ చేస్తారని చెప్పారు. దీని వల్ల విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నప్పుడు ఈ కార్డు ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ చెప్పారు.

ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలి

విద్యార్థులంతా అపార్ గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ సూచించారు. కళాశాలలో అపార్ కార్డు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ, పీజీ, స్కాలర్‌షిప్, అవార్డులు తదితర వివరాలు అపార్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్డులతో ఎన్నో ఉపయోగాలున్నాయని చెప్పారు. భీమ్‌రావు, భరత్‌రాజ్, కవిత, స్వామి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సంక్షేమం, నిధులపై సమీక్షిస్తాం**

గజ్వేల్: ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల ఖర్చు, సంక్షేమ పథకాల అమలుపై త్వరలోనే సమీక్ష నిర్వహిస్తామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. శనివారం దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, జాతీయ కార్యదర్శి పి.శంకర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సభ్యులు ఆయనను హైదరాబాద్‌లో కలిసి చర్చించారు.

◆ **29న గాయకుల ఎంపిక**

సిద్దిపేటకమాన్: 'నూరేళ్ల నా ఊరు' గేయ కావ్యానికి 29న సిద్దిపేటలో ఉమ్మడి మెదక్ జిల్లా గాయకుల ఎంపిక నిర్వహించనున్నట్లు కవి శ్రీనివాస్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ 243 చరణాల గేయకావ్యాన్ని రచించి, 243 మంది గాయకులతో పాడించేందుకు అన్ని ప్రాంతాల నుంచి గాయకులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో నర్సింహులు, శివ, శ్రీనివాస్, క్రాంతి, గణేష్, రవీందర్ పాల్గొన్నారు.

◆ **ఇందూరులో హ్యాకథాన్‌పై వర్క్‌షాప్**

సిద్దిపేటఅర్బన్: ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను పరిష్కరించడానికి హ్యాకథాన్ మంచి వేదికగా ఉపయోగపడుతుందని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.పి.రాజు అన్నారు. కళాశాలలో శనివారం హ్యాకథాన్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటివి కళాశాల స్థాయిలో ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుందని, అందుకోసం అంతర్గత పోటీలు నిర్వహించామన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బెనర్జీ, సమన్వయకర్త భాగ్యరెడ్డి, పీఆర్వో రఘు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

◆ **టీపీఎస్‌ఏ జిల్లా కమిటీ నియామకం**

సిద్దిపేటఅర్బన్: తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్(టీపీఎస్‌ఏ) జిల్లా నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అర్బన్ ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా జి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఎల్.విజయ్ కుమార్, కోశాధికారిగా వి.రామ్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎండీ ఫహీం, ఉపాధ్యక్షులుగా డి.రాములు, బి.రాజు, ఎస్.శ్రీకాంత్, పి.రాజమణి, సహాయ కార్యదర్శులుగా పి.గణేశ్, బి.మహేశ్, ఎం.శోభ, బి.అరుణశ్రీ తదితరులు ఎంపికయ్యారు.

◆ **మాజీ మంత్రి పెద్దిరెడ్డి పూజలు**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి రాజేశ్వరస్వామిని శనివారం మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలను అందజేసి, శాలువాతో సన్మానించారు. ఆయన వెంట జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, వేముల ప్రభాకర్‌రెడ్డి, సంపత్‌నాయక్ తదితరులు ఉన్నారు.

◆ **బాధ్యులను శిక్షించాలి**

చేర్యాల(సిద్దిపేట): విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, దండ్యాల లక్ష్మారెడ్డి, మన్నె సత్యవర్ధన్, నర్ర మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ మండల పరిధిలోని శబాష్‌గూడెంకు చెందిన విద్యార్థి మనోజ్ ఉపాధ్యాయులు దండించినందుకే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు.

◆ **ధర్మయుద్ధ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ**

బెజ్జంకి(సిద్దిపేట)/మిరుదొడ్డి(దుబ్బాక)/గజ్వేల్: ఈనెల 28న సిద్దిపేటలో నిర్వహించే ధర్మయుద్ధ సన్నాహక సభకు ఉమ్మడి జిల్లా నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు పెరుక పరశురాములు పిలుపునిచ్చారు. బెజ్జంకిలో శనివారం సభ పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పరశురాములు, జితేందర్, శంకర్, బాబు, రాజు, భూమయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శాంతి కుమార్ మాట్లాడారు. మాదిగలను నమ్మించి మోసం చేసిన రేవంత్ రెడ్డిని రాజకీయంగా బొందపెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కరుణాకర్, తరుణ్ రాజు తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్‌లో నిర్వహించిన సమావేశంలో మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) రాష్ట్ర సీనియర్ నాయకుడు లింగంపల్లి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ఎంఎస్‌పీ జిల్లా నాయకులు పరశురాములు, రాములు, యాదగిరి పాల్గొన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పోరాటాలను ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. శ్రీహరి, శనిగిరి రమేశ్, ఆంజనేయులు, రవీందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఉమ్మడి జిల్లా సమావేశం**

నంగునూరు(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశం సోమవారం సిద్దిపేటలో నిర్వహించనున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా సంయుక్త కార్యదర్శి కనకయ్య తెలిపారు. శనివారం నంగునూరులో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు.